ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 8 నవంబరు 2025 | 5

క్షణికావేశం.. తీసుకున్నాడు ప్రాణం!

అనుమానం పెనుభూతమైంది.. ఇద్దరు పిల్లలు ఉన్నా ఏమాత్రం ఆలోచించలేదు.. క్షణికావేశంలో పీక కోసి భార్య ప్రాణాలు తీయడానికి ప్రయత్నించడమే కాదు.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.. ఈ విషాదఘటన కాకినాడ రూరల్ మండలం తూరంగిలో జరిగింది.. 7





వందేమాతరం

ఆ గీతం అజరామరం.. ఏ తరమైనా ఆ గీతం ఆలపించాల్సిందే.. దేశభక్తిలో మునిగి తేలాల్సిందే.. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఊరూవాడా కదిలింది.. వందేమాతరం గీతం ఆలపిస్తూ తమలోని దేశభక్తిని చాటుకున్నారు.. కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్, డీఆర్వో సీతారామ్మూర్తి వందేమాతర గీతం ఆలపించారు. తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇలా వందేమాతరం ఆకారంలో కూర్చుండిపోయారు. బిక్కవోలు మండలం పందలపాక హైస్కూల్లో విద్యార్థులు వందేమాతర గీతం ఆలపించారు. - రాజమహేంద్రవరం సిటీ

విజ్ఞానం.. వినోదం



అదొక అద్భుతం.. అది మరో ప్రపంచం.. ఎంత చూసినా తనివితీరదు.. ఎక్కడికెళ్లామో తెలియదు.. ఏం చేశామో గుర్తురాదు.. అదొక మాయాప్రపంచమే.. మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోంది.. అందుకే సెలవు రోజు వచ్చిందంటే చాలు విద్యార్థులు రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో ఉన్న సైన్స్ మ్యూజియానికి క్యూకట్టేస్తున్నారు.. నామమాత్రపు రుసుంతో ప్రవేశానికి అవకాశం కల్పించడంతో వేలాదిగా తరలివస్తున్నారు..శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు.. మ్యూజియం అణువణువు తిలకించారు. అబ్బా ఎంత బాగుందో అంటూ ఆశ్చర్యానికి లోనయ్యారు.. జూన్ నుంచి ఇప్పటి వరకూ 25 వేల మంది విద్యార్థులు విజ్ఞాన కేంద్రం సందర్శనకు వచ్చినట్టు డీఈవో తెలిపారు.
- రాజమహేంద్రవరం

శ్రీరంగపట్నం,ముక్కామల కార్యదర్శుల సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు గ్రేడ్-3 కార్యదర్శులను సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి ఉత్తర్వులు విడుదల చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పంచాయతీలో గ్రేడ్-3 కార్యదర్శిగా పనిచేస్తున్న కె.శాంతిప్రసన్న గ్రామంలోని ఇంటి పన్నులకు సంబంధించి 2155 ఎసెస్‌మెంట్లు ఉండగా 1158 ఎసెస్‌మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో మ్యాపింగ్ చేసినట్టు గుర్తించారు. కొవ్వూరు డివిజన్ పరిధి పెరవలి మండలం ముక్కామల గ్రామ పంచాయతీలో గ్రేడ్-3 కార్యదర్శిగా పనిచేస్తున్న పి.పవన్ కుమార్ గ్రామం పరిధిలో 1488 ఎసెస్‌మెంట్లకు 372 ఎసెస్‌మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో మ్యాపింగ్ చేశారు. దీంతో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు.

నియోజకవర్గాల వారీ విజన్ యాక్షన్ ప్లాన్

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విజన్ యాక్షన్ ప్లాన్ 2047లో భాగంగా జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంవారీ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక వనరులు, మానవ మూలధనం, పరిశ్రమలు, వ్యవసాయ సామర్థ్యం, పర్యాటక అవకాశాలను పరిగణనలోకి తీసుకుని సెక్టార్ వారీ విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త విధానంలో మహిళా సంఘాలు,యువజన సంఘాలతో చర్చలు జరిపి సమగ్ర నివేదిక రూపొం దించాలన్నారు. ఉపాధి అవకాశాలు, పరిశ్రమల గ్రౌండింగ్, ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో సృజ నాత్మకతను ప్రోత్సహించేలా ప్రతిపాద నలు సిద్ధం చేయాలన్నారు.మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 2029కి ముందే నగర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో మెరుగుపరచే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీపీవో ఎల్.అప్పలకొండ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత,ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



నేరము..శిక్ష!

ఈయనెవరో తెలుసా.. ఈ సీన్ చూస్తుంటే రోడ్డు పక్కన నిలబడి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నట్టు ఉంది కదూ.. మీరూహించింది నిజమే.. కానీ అతను ట్రాఫిక్ కానిస్టేబుల్ కాదండోయ్.. పెరవలి మండలం కాపవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రామకృష్ణ బహిరంగంగా మద్యం సేవించి అందరినీ ఇబ్బందిపెడుతుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రూ.200 జరిమానాతో పాటు 2 గంటల పాటు ప్రభుత్వ కార్యాలయంలో సేవలందించాలని జడ్జి తీర్పుఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ పెరవలి హైవేపై ట్రాఫిక్ డ్యూటీ చేయించినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. - పెరవలి



కాకినాడలోని ది జయలక్ష్మి కో ఆపరేటివ్ సొసైటీ భవనం

మూడున్నరేళ్లు దాటేసినా..

జయమేది!

నేటికీ తేలని జయలక్ష్మి సొసైటీ కేసు

కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డిపాజిటర్లు ఇందులో డబ్బులు పొదుపు చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బిచాణా ఎత్తేసింది. బాధితులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. కేసు విచారణలో భాగంగా కుంభకోణానికి ప్రధాన సూత్రదారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లను సీఐడీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించింది. వీరికి సంబంధించిన రూ.450 కోట్ల విలువైన 98 స్థిరాస్తులను సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాల్సి ఉన్నా ఇదేదీ జరగడం లేదు. కేసు రాజమహేంద్రవరంలోని పీడీజే న్యాయస్థానంలో కొనసాగుతుండగా పదేపదే కేసులో సీఐడీ వాయిదాలు కోరుతోంది. దీంతో వేలం ప్రక్రియ ఎప్పటికీ జరుగుతుందో అంతు పట్టడం లేదు. బాధితులకు న్యాయం చేసేందుకు సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తు లను వేలం వేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేలం ప్రక్రియ ముందుకు సాగేలా సీఐడీని ప్రభుత్వం ఆదేశించింది.కానీ సీఐడీ చొరవ చూపడం లేదు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రూ.582 కోట్ల జయలక్ష్మి సొసైటీ స్కాం బాధితులకు న్యాయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. సీజ్ చేసిన ఆస్తులు వేలం వేసి న్యాయం చేసేందుకు సీఐడీ ప్రయత్నించడం లేదు. పదే పదే కేసులో వాయిదాలు కోరుతూ బాధితులను ముప్పుతిప్పలు పెడుతోంది. స్కాం సమయంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్ల నగదు విడుదల చేయాల్సి ఉన్నా అదీ చేయడంలేదు. తాజాగా సొసైటీకి రుణ వసూళ్ల కింద జమయిన రూ.7.50 కోట్లు సీఐడీ ఏకంగా ఫ్రీజ్ చేసేసింది. వీటిని బాధితులు పంచుకోకుండా అకౌంట్లు స్తంభింపచేసింది.అదే సమయంలో పులిమీద పుట్రలా స్కాంకు ముందు నిందితులు జరిపిన లావాదేవీల ఆధారంగా రూ.15 కోట్లు పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ ప్రస్తుత సొసైటీకి ఇటీవల నోటీసులు జారీ చేసి షాక్ ఇచ్చింది. నిందితుల ఆస్తులు వేలం వేసి డబ్బులు ఇవ్వాలని విజయవాడ కోపరేటివ్ ట్రిబ్యునల్ కేసులూ కొలిక్కిరావడం లేదు. ఇప్పట్లో న్యాయం జరిగే అవకాశాలు క్రమేపీ క్షీణించుకుపోతుండ డంతో చిన్న డిపాజిటర్లు లబోదిబోమంటున్నా రు.ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

డిపాజిట్‌దారులు 21,895

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి చెల్లించాల్సిన మొత్తం రూ.511 కోట్లు ఉంది. రూ.లక్షలోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా రూ.32.72 కోట్లు చెల్లిం చాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 నుంచి రూ.4 లక్షల లోపు 810మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు,రూ.5లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది.

ఆ డబ్బూ సీజ్...

సీజ్ చేసిన ఆస్తుల వేలానికి సీఐడీ చొరవ చూపకపోగా..గతంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్లు విడుదల చేయడానికి సీఐడీ ఆసక్తి చూపడం లేదు.తాజాగా సొసైటీకి మరోషాక్ ఇచ్చింది. కుంభకోణం తర్వాత ఏర్పడ్డ కొత్త పాలకవర్గం రుణాలు తీసుకున్న వారిని గుర్తించి రూ.7.50 కోట్లు రాబట్టింది. దీంతో చిన్న డిపాజిటర్లకు చెల్లించి న్యాయం చేస్తారని భావించారు. కానీ ఈలోపు సీఐడీ షాక్ ఇచ్చింది. కొన్ని రోజుల కిందట ఈ నగదును సీజ్ చేసేసింది. దీంతో ఇప్పుడు బాధితులు లబోదిబోమంటున్నారు. మరోపక్క కుంభకోణానికి ముందు నిందితులు రెండు పాన్ కార్డులు వినియోగించారు. ఒకటి ఇప్పటికీ నడుస్తుండగా..మరొకటి వినియోగంలో లేదు. 2017-2018 నాటి సొసైటీ కోట్ల రూపాయల లావాదేవీల ఆధారంగా ఇప్పుడు రూ.15 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాలంటూ ఐటీ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడున్న పాలకవర్గానికి షాక్ తగిలినట్లయింది. ఒకపక్క సీఐడీ, మరోపక్క ఐటీ నుంచి ముప్పేట దాడి జరుగుతుండడంతో ప్రస్తుతం పాలకవర్గం నెత్తీ నోరు బాదుకుంటోంది.

- మూడున్నరేళ్లుగా సాగదీత
- ఎటూ తేల్చని సీఐడీ
- వాయిదాలతో కాలయాపన
- రూ.450 కోట్ల ఆస్తులు సీజ్
- వేలంపై ఎడతెగని జాప్యం
- తాజాగా అకౌంట్లలో నగదు సీజ్
- 43 కేసులు దాఖలు

కేసులపై కేసులు దాఖలు..

నిందితులు,రుణగ్రహీతల ఆస్తులు వేలం వేసి తమకు ఆ డబ్బు ఇవ్వాలంటూ విజయవాడలోని డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ట్రిబ్యునల్‌లో బాధితుల తరపున సొసైటీ సభ్యులు ఇప్పటి వరకు 13 కేసులు దాఖలు చేశారు.తాజాగా మరో 30 కేసులు దాఖలు చేశారు.ఈ కేసులకు సం బంధించి ఆస్తుల విలువ రూ.70 కోట్లు ఉంది. వీటిపై తుది తీర్పు వస్తే కొంత వరకు నగ దు తిరిగొచ్చే అవకాశం ఉంది.ఈ డబ్బొస్తే చిన్న బాధితులకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నా ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి.

పంచాయతీల్లో డిజాస్టర్ వలంటీర్ల నియామకం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముంపు నివారణ చర్యలకు సమగ్ర ప్రణాళిక అవసరమని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె జేసీ మేఘాస్వరూప్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. మొంథా తుఫాన్ వల్ల పంటలు ముంపునకు గురికావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇక భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బుష్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మేజర్, మైనర్, స్మాల్ ఇరిగేషన్, పంచాయతీ రాజ్ చెరువుల స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ముంపు నివారణ చర్యలకు గ్రామ స్థాయిలో స్వచ్ఛంద డిజాస్టర్ వలంటీర్లను నియమించాలని సూచించారు. వారు చెరువుగట్ల పటిష్టతపై నివేదిక ఇవ్వాలన్నారు. వచ్చేవారంలో తహశీల్దార్లు, ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో నోటిఫికేషన్ జారీ చేసి విలేజ్ డిజాస్టర్ వలంటీర్ల నియమిస్తామన్నారు.చెరువుల గట్లు నిరంత రం తనిఖీ చేయడం నివేదికలు సమర్పించడం, నీటి వినియోగదారుల సంఘాలు, డిజాస్టర్ వలంటీర్లకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇరి గేషన్ సీఈ శేషుబాబు, ఎస్‌టి కె. గిరిధర్, డీఈ జి.మనోజ్‌కుమార్, ఎర్రకా లువ ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత | డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి 7



రాజమహేంద్రవరంలో సాగుతున్న గోదావరి ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు

గోదారి మారుతోంది!

అఖండ గోదావరి ప్రాజెక్టు పనుల్లో కదలిక

- ఇప్పటికే పూర్తయిన టెండర్లు
- వేగంగా పుష్కరఘాట్ పనులు
- మిగిలినవి త్వరలో ప్రారంభం
- మారనున్న హేవలాక్ వంతెన

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. పుష్కరఘాట్ అభివృద్ధి ప నులు వేగవంతం అయ్యాయి.2026 మార్చి నాటికి పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. హేవలాక్, కడియపులంక నర్సరీల మధ్య ఎక్స్‌పీరియన్స్ సెంటర్, నిడద వోలులో కెనాల్ టూరిజం పనులకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ఆరంభించన్నారు. ఇదిలా ఉండగా అఖండ గోదావరి ప్రాజెక్టు ఈడీ ఎం.శేషగిరిరావు శుక్రవారం పనులను పరిశీలించి సూచనలు చేశారు ఈ అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్ 26న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. సుమారు రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పుష్కర ఘాట్ అభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. మార్చి నాటికి ఘాట్ పనులు పూర్తవుతాయని ఈడీ శేషగిరిరావు తెలిపారు.

పుష్కరాలకు ముందే ఇలా..

2027 పుష్కరాలకు ముందే అఖండ గోదా వరి ప్రాజెక్టును సిద్ధం చేసి సుమారు 8 వేల మంది యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి-2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్) స్కీమ్ ద్వారా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును నిర్మించ నున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య గోదావరిపై మొదటి రైలు వంతెన హేవలాక్ బ్రిడ్జి టూరిజం హబ్‌గా రూపుదిద్దుకోనుంది. 127 ఏళ్ల చరిత్రగల ఈ బ్రిడ్జి పర్యాటకులకు వేదికగా మారనుంది. 2.7 మీటర్ల పొడవు ఉన్న ఈ బ్రిడ్జికి 54 స్పాన్‌లు ఉన్నాయి. అందులో 25 స్పాన్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయ డానికి నిర్ణయించారు. ఇక వంతెన 18వ స్పాన్ వద్ద గోదావరిలో ఉన్న 120 ఎకరాల బ్రిడ్జి లంకలో టెంట్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. హేవలాక్, పుష్కరఘాట్లను అనుసంధానం చేయనున్నారు. కడియం నర్సీలను టూరిజం స్పాట్‌గా, ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా తీర్చిదిద్ద నున్నారు. కడియపులంక, పొట్టిలంక, పరిసర నర్సరీల చుట్టూ పర్యాటక సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ కాలువలో బోటింగ్ ఏర్పాటు చేయనున్నారు.నిడదవోలులోని చారిత్రక కోట సత్తెమ్మ ఆలయానికి కొత్త శోభ తేనున్నారు. యాత్రికులకు అదనపు వసతి గృహాలు ఏర్పాటు చేస్తారు.ఆలయ రాజ గోపురం ఆధునీకరించనున్నారు.సమిశ్రగూడెం వద్ద గోదావరి కాలువలో నిత్యహారతి ఘాట్ ఏర్పాటు చేయనున్నారు. బోటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు.

మార్చికి పుష్కరఘాట్ సిద్ధం : ఈడీ

పుష్కరఘాట్ పనులు మార్చి నెలాఖరుకి పూర్తి చేయనున్నట్టు ప్రాజెక్టు ఈడీ ఎం. శేషగిరిరావు తెలిపారు.ఈఈ రెడ్డి, డీఈ సత్య నారాయణ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం పుష్కరఘాట్‌లో పనులు పరిశీలించి, అధికారులు, డిజైనర్లకు పలు సూచనలు చేశారు. హేవలాక్ బ్రిడ్జి, నిడదవోలు, కడియపులంకకు ప్రాంతానికి సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



వక్తృత్వ పోటీల్లో విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత తదితరులు

ప్రతి ఒక్కరికీ సమన్యాయం

ఉమ్మడి జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమన్యాయం, సమాన హక్కులను పొందేలా చూడడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని..రాజీ మార్గమే రాజ మార్గమనే నినాదంతో న్యాయ సేవలు సంస్థ అందిస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైరపర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ న్యాయ సేవా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని 39-ఏ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడు న్యాయ సహాయం పొందే హక్కు కలిగి ఉన్నారన్నారు. అందరికీ సమాన హక్కులు, సమన్యాయం లభించాలని 1, 14, 22 ఆర్టికల్స్ స్పష్టం చేస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 867 మందికి లీగల్ ఎయిడ్ లభించిందన్నారు. 3,513 అవగాహన కార్యక్రమాల నిర్వహణ ద్వారా 1,76,678 మందికి డీఎల్ఎస్ఏ సేవలు లభించాయని చెప్పారు. 1,374 గ్రామాల్లో అవగాహనపై చర్యలు చేపట్టామన్నారు. వృద్ధాశ్రమాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు తదితర చోట్ల పర్యటించి, పరిశీలన చేసి ఆయా కలెక్టర్లతో పాటు హైకోర్టుకు నివేదికలు ఇస్తున్నామన్నారు. గతేడాది డిసెంబరు నుంచి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 20,344 కేసుల పరిష్కారం జరిగిందని, బాధితులకు రూ.కోటి 71 లక్షల 80 వేల పరిహారం అందిందని చెప్పారు. రహదారి భద్రత, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రతినిధి శోభనాద్రి శాస్త్రి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'వందే మాతరం' ఇది.. మా తరం

» 150 ఏళ్ల సంబరాల్లో విద్యార్థులు

వందేమాతరం గేయం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు శుక్రవారం దేశభక్తిని చాటుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 150వ సంఖ్యలోను, వందేమాతరం ఆకారంలోను ఒదిగి దేశంపట్ల, వందేమాతరం గేయం పట్ల తమకున్న గౌరవాన్ని తెలియజేశారు. కాగా, విద్యార్థులను పలువురు అభినందించారు.


రాజోలు మండలం పొదలాడలో శాంతినికేతన్ విద్యార్థులు


ముమ్మిడివరం మండలం ఉషాకిరణ్ ఐటీఐలో..


మామిడికుదురులో వందేమాతరం ఆకారంలో ఒదిగిన దీప్తి విద్యార్థులు


అమలాపురంలోని సర్ సీవీ రామన్ పాఠశాలలో జాతీయ జెండాతో..


అన్నవరంలో సత్యదేవ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రదర్శన


ఏలేశ్వరం గురుకుల పాఠశాల ఆవరణలో 150 అంకెల ఆకారంలో ఒదిగిన బాలికలు


రాజానగరంలో వందేమాతరం అక్షర రూపంలో గాయత్రి పాఠశాల విద్యార్థులు

కాకినాడలో ఘనంగా 'వందేమాతరం' 150 ఏళ్ల సంబరాలు

» హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు రాధామోహన్ దాస్ అగర్వాల్, సానా సతీష్, ఎమ్మెల్సీ సోము, ఎమ్మెల్యే నల్లమిల్లి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు.. స్వాతంత్ర్య పోరాటంలోని సన్నివేశాల నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

కాకినాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం నినాదంతో ఆ ప్రాంతం మార్మోగింది. బ్రిటీష్ పాలకుల విభజన ఆలోచనలకు చరమగీతం పాడేలా అందరిలో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన వందేమాతరం గీతం 150ఏళ్లు పూర్తి చేసుకున్నవేళ.. 'స్వరాజ్యం-స్వదేశీ-సమైక్యత' అనే నినాదంతో కాకినాడలో సంబరాలు అంబరాన్నంటాయి. కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశిష్ట అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు రాధామోహన్‌దాస్ అగర్వాల్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పంతాడ సురేష్ హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

వందేమాతర గేయాన్ని విష్ణు దిగంబర్ పులస్కర్ ఆలపిస్తుండగా మహ్మద్ అలీ అడ్డుకున్న ఘట్టంతోపాటు స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలోని కొన్నిసన్నివేశాలను నాటికల రూపంలో ముందుగా ప్రదర్శించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ విభజనకు నాంది పలికిన కాకినాడ ప్రాంతంలోనే వందేమాతరం గీతానికి అవమానం జరిగిందని, నేడు అదే ప్రాంతంలో వందేమాతరం 150ఏళ్ల వేడుక జరుపుకోవడం చారిత్రక ఘట్టమని అన్నారు. ఎక్కడైతే వందేమాతరం గేయానికి అవమానం జరిగిందో అక్కడే 150ఏళ్ల వేడుకలు జరపడం చరిత్రేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆలోచనలను ప్రేరేపించే అనేక కార్యక్రమాలను బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టడం మంచి నిర్ణయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మతపరమైన ఆలోచనలకు నాంది పలికింది కాకినాడలో ఏఐసీసీ సమావేశమన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ కాకినాడలో పూర్తి వందేమాతరం గీతాన్ని ఎక్కడ అడ్డుకున్నారో అక్కడే 150ఏళ్ల వందేమాతర వేడుకలు నిర్వహించడం, అందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధా మోహన్ దాస్ అగర్వాల్ మాట్లాడుతూ.. వందేమాతరం గొప్పతనాన్ని వివరించారు. తొలి సారిగా తాను కాకినాడ వచ్చానన్నారు. వందేమాతరం 150ఏళ్ల ఉత్సవంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఒక దేశద్రోహి పేరు కాకినాడలో ఓ వీధికి పెట్టడం విచారకరమని, ఈవిషయాన్నిప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. వందేమాతరం గీతాలాపన సమయంలో కాంగ్రెస్‌నేత మహ్మద్ అలీ అడ్డుకున్నారన్నారు. కాకినాడలో అఖిల భారత్ కాంగ్రెస్ మహాసభలు వందేమాతారం గీతాన్ని గాయపరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి వచ్చేలా కాకినాడలో కార్యక్రమం ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అభినందించారు. వేలాది మంది విద్యార్థులతో వందేమాతరం పూర్తిగేయాన్ని పాడించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రదర్శించిన కత్తిపోటు వేషాలు




పెళపెళ.. వరుస ఊచకోత!

పక్కలో బల్లెం, పొట్ట మధ్య లోపల నుంచి బల్లెంతో పొడవడం, జబ్బపై కత్తితో నరకడం, పొట్ట లోపల నుంచి కత్తితో పొడవడం, వినాయకుడి వేషంలో నరకాసురున్ని వధించడం, రంపంతో కోయడం వంటి ఒళ్లు గగుర్పాటు కలిగించే వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చి కళాకారులు ఆకట్టుకున్నారు.

» గగుర్పాటు కలిగించేలా కత్తిపోటు వేషధారణల ప్రదర్శన

» కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాల ముగింపులో ఆకట్టుకున్న కళాకారులు

కొత్తపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పట్టుసాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిఏటా కార్తీక పౌర్ణమి తర్వాత గౌరీదేవిని ఆలయంలో ప్రతిష్ఠించి విశేషపూజలతో అంగరంగ వైభవంగా ముగింపుఉత్సవాలు నిర్వహించడం మూలపేటలో ఆనవాయితీగా వస్తోంది. కత్తిపోటువేషాల ప్రదర్శన ఖర్చుతో కూడినది కావడంతో మూడేళ్లకు ఒకసారి జరుపుతుంటామని నిర్వాహకులు తెలిపారు. కొత్తపల్లి గాజులదొడ్డిలో ముగింపు ఉత్సవాలను బ్యాండ్ మేళాలతో, తీన్మార్ ప్రదర్శనలతో వైభవంగా నిర్వహించారు.

రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మనవాళ్లు

అనంతపురంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.






అనంతపురంలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీల్లో భాగంగా ప్రారంభ కవాతు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఉద్యోగులు


కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్ రోడ్డును పరిశీలిస్తున్న బాషా

తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్ బాషా

కొత్తపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి విషయాల్లో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ షేక్ ఖలీఫతుల్లా బాషా పేర్కొన్నారు. మొంథా తుపాన్‌కు కోతకు గురైన కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సుబ్బంపేట రచ్చబండ వద్ద మత్స్యకారులతో తుఫాన్ సహాయక చర్యలు, స్థానిక పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వంటి అంశాలపై చర్చించారు. పర్యటనలో ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ, ఆర్టీఐ ఆంధ్రప్రదేశ్ జేఏసీ అధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్, ముస్లిం థింకర్స్ ఫోరం సహ కన్వీనర్ హసన్ షరీఫ్ పాల్గొన్నారు.


ఉప్పాడ బీచ్ రోడ్డులో సిమెంటు కాంక్రీటు పనులను పరిశీలిస్తున్న క్రాంతి

శరవేగంగా బీచ్ రోడ్డు మరమ్మతులు

ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీరు క్రాంతి

కొత్తపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ సమయంలో కెరటాల ధాటికి ఛిద్రమైన ఉప్పాడ బీచ్ రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతి తెలిపారు. బీచ్ రోడ్డులో పెద్ద వంతెన సమీపంలో కెరటాల ఉధృతికి రోడ్డు విరిగినచోట సిమెంటుతో చేపట్టిన కాంక్రీటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఎస్ఈ వెంట ఇన్‌చార్జి ఈఈ నర్సయ్య, జేఈఈ లోవరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుజ్జి వున్నారు.


దాత రవికుమార్ దంపతులకు స్వామి, అమ్మవార్ల ఫొటో అందజేస్తున్న ఈవో జగన్మోహనశ్రీనివాస్

పాదగయలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పిఠాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకం ట్రస్టుకు గొల్లప్రోలుకు చెందిన దంగేటి రవికుమార్-సాయిరత్నం దంపతులు రూ.1,01,116 విరాళాన్ని శుక్రవారం ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్‌కు అందజేశారు. దంగేటి అప్పన్న, అచ్యుత పేరున ప్రతిఏటా కార్తీక పౌర్ణమి రోజున అన్నదానం జరపాలని కోరారు. దాత కుటుంబ సభ్యులను ఈవో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. సూపరింటెండెంట్ వీరభద్రరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.



65 కిలోల ఇత్తడి రుద్రాక్ష మండపం బహూకరణ

ఆత్రేయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో వేంచేసియున్న ఉమాకమండలేశ్వరస్వామికి ర్యాలి సుబ్బారావు జ్ఞాపకార్థం లక్ష్మీమాణిక్యాంబ కుమారులు, కుమార్తెలు 65 కిలోల ఇత్తడితో రుద్రాక్ష మండపం చేయించారు. శుక్రవారం దానిని ఆలయానికి బహూకరించగా సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంలను ఈవో బీహెచ్‌వీ రమణ మూర్తి అందజేశారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రాజశేఖరం (పక్కన) స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడలతో మరింత ఆత్మవిశ్వాసం

69వ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్క్వాష్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్క్వాష్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రకాశనం అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సతీష్‌కుమార్ అధ్యక్షత వహించారు. అండర్-14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్క్వాష్ అనేది కేవలం క్రీడ మాత్రమే కాదని... శరీరం మనసును సమానంగా శక్తివంతం చేసే ఆరోగ్యకరమైన కసరత్తు అన్నారు. ఈ వేగవంతమైన ఇండోర్ గేమ్ గుండె ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని, శక్తి సమన్వయాన్ని పెంపొందిస్తుందన్నారు. వేగవంతమైన స్పందన సామర్థ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. యువతలో దృష్టికి పదునుపెట్టి, ఒత్తిడిని తగ్గిస్తూ వ్యూహాత్మక ఆలోచనలను అభివృద్ధి చేసే ప్రత్యేకత కూడా ఈ ఆటలో ఉందన్నారు. కొత్త స్నేహాలు, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి స్క్వాష్ ప్రధాన విలువలను వివరించారు. రాష్ట్రవ్యాపంగా పలు జట్లు పాల్గొంటున్న ఈ చాంపియన్‌షిప్ శనివారం ముగుస్తుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి తెలిపారు.

కార్యక్రమంలో డీఈవో పిల్లి రమేష్, రాష్ట్ర వ్యాయామ విద్య పర్యవేక్షణ అధికారి మహబూబ్ బాషా, అబ్జర్వర్ ఎస్.బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, కాకినాడ జిల్లా పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీలు లంకా జార్జ్, రవిరాజ్, జి.సునీల్‌కుమార్, కె.మంగమ్మ, జీజేఆర్ఎస్ కౌర్, సూరిబాబు, నాగమణి, దీప్తి ఎస్తేర్, డీఎస్ఏ కోచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అక్కాచెల్లెళ్లు రెజ్లింగ్‌లో మెరిశారు

రాష్ట్ర స్థాయి పోటీల్లో వేట్లపాలెం విద్యార్థులకు బంగారు పతకాలు


బంగారు పతకాలతో సుధీష్ణ (పైన). హారికశ్రీ (కింద)



సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన అక్కాచెల్లెళ్లు సత్తా చాటారు. కేజీ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దాసరి సుధీష్ణ అండర్-14 విభాగంలో, పదో తరగతి చదువుతున్న దాసరి హారికశ్రీ అండర్-17 విభాగంలో బంగారు పతాకాలు సాధించారు. డిసెంబరు 8 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏపీ తరపున వీరు పాల్గొంటారని పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులకు, వారి విజయానికి తోడ్పాటు అందించిన తల్లిదండ్రులకు, పాఠశాల హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు. సుధీష్ణ, హారికశ్రీ ప్రతిభ కనబర్చడంలో విశేష కృషి చేసిన వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు, పీఈటీ ఎండీ ఇబ్రహీంలను కూడా అభినందించారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.73 కోట్లు

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,73,37,811 నగదు, 37 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటుగా ఫ్రాన్స్ కరెన్సీ 200, యూఎస్ఏ 41 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పౌండ్స్, స్కాట్లాండ్ 20 డాలర్లు లభించాయి. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లెక్కించగా సరాసరిన రోజుకు రూ.5.77 లక్షలు భక్తులు హుండీలలో సమర్పించారు.


హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శుక్రవారం ఇద్దరు దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. జగ్గంపేటకు చెందిన కంచర్ల శ్రీనివాసరావు రూ.లక్ష, విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన గోలి గురునాధరావు రూ.1,01116 ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

శివసదన్ క్యాటేజీకి రూ.10 లక్షల విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత సుబ్బారావు

అన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీలో ఒక గదికి డోనర్‌స్కీమ్ ద్వారా కాకినాడకు చెందిన ములకల సుబ్బారావు, కనకదుర్గ దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని శుక్రవారం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.

బండి.. జాగ్రత్తండి!

తరచూ రోడ్డు ప్రమాదాలు చూస్తూనే ఉంటాం... అయినా కొందరిలో మార్పు రావడంలేదు. ఆటోలో అంచున కూర్చుని ప్రయాణం చేస్తున్నవారు కొందరైతే.. హైవేపై అజ్రాత్తగా వాహనాలు నడుపుతున్నారు మరికొందరు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం..






రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై ఒకే వాహనంపై ముగ్గురు ఇలా..


కాకినాడ జిల్లా అన్నవరం - కత్తిపూడి రహదారిపై ఆటోలో అంచున కూర్చున్న మహిళలు ఇలా...

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, కాకినాడ/ రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



హైవేపై యువకులు జారిపడేలా..

చోరీ కేసుల్లో నిందితులకు ఆరు నెలల జైలు

రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనం కేసుల్లో ముగ్గురు నేరస్తులకు 6 నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ 5వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ జి.శ్రీనివాస రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2024 నవంబరు 11న క్వారీ సెంటర్ సమీపంలోని డీమార్ట్‌కు వెళ్లి బయటకు వచ్చేసరికి తన ద్విచక్రవాహనం లేదని సీహెచ్. రామకృష్ణ, నవంబరు 8న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద తన ద్విచక్ర వాహనం దొంగిలించారని గోలి రామ్‌ప్రసాద్, వీవర్స్ కాలనీలో తన ఇంటి వద్ద పార్క్ చేసిన వాహనం కనిపించలేదని అదేనెల 14న గోకాడ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు రాజమహేంద్ర వరం శానిటోరియం ప్రాంతానికి చెందిన పిల్లి దేవేంద్ర(పిల్లి), ఆంధ్ర రమణ(కేసీఆర్), చప్పిడి సాయి కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం మొదటి 2 కేసుల్లో నిందితులైన దేవేంద్ర, రమణ, సాయి కుమార్, తర్వాతి 2కేసుల్లో నిందితులైన దేవేంద్ర, రమణకు కోర్టు జైలు శిక్ష విధించిందని తెలిపారు.

కారులో గంజాయి రవాణా

ముగ్గురి అరెస్ట్
21.7 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గండేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 21.7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామ శివారు ఎన్టీ రాజపురం రోడ్డులో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా మారుతి షిఫ్ట్ కారులో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. కారులో ఉన్న తాకు నరసింహ సింగ్, పున్నాన తేజ, మహేందర్ సింగ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి 11 ప్యాకెట్లలో ఉన్న రూ.1,08,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 3 స్మార్ట్‌ఫోన్లు, రూ.2 వేలు నగదు, షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.3,73,500 ఉంటుందని సీఐ తెలిపారు. గంజాయి సేకరణలో 13 మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు ప్రాథమికంగా సమాచారం ఉందని, దర్యాప్తు చేసి 13 మందిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ, గండేపల్లి ఎస్ఐ యువిశివ నాగబాబు, కిర్లంపూడి ఎం.రాజు, ఎ.వీరబాబు,కృష్ణారావును జిల్లా ఎస్పీ అభినందించారు.

7 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న 7 టన్నుల రేషన్ బియ్యాన్ని, 2 వ్యాన్లను విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ సీఐ మధుబాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై 6ఏ, 7వన్ కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని గోపాలపురం స్టాక్ పాయింట్‌కు చేర్చి వ్యాన్లను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

ప్రమాదం అంచుకు..

శంఖవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బెంగుళూరు నుంచి విశాఖపట్నం ప్లేవుడ్ లోడుతో వెళ్తున్న లారీ కత్తిపూడి సమీపంలో అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొంది. లారీ పూర్తిగా డివైడర్ గోడపై నిలిచిపోవడంతో కాలువలో పడే ప్రమాదం నుంచి తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.


శంఖవరం జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్ ఎక్కిన లారీ

అనుమానం పెనుభూతమై...

కత్తితో భార్య పీక కోసిన భర్త
అనంతరం పురుగులమందు తాగి పీక కోసుకుని ఆత్మహత్య
కాకినాడ జిల్లా తూరంగిలో ఘటన


రాజేష్ మృతదేహం


కాకినాడలో చికిత్స పొందుతున్న దేవి

కాకినాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కత్తితో పీక కోసి అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చీపురుపల్లి దేవి (34), చీపురుపల్లి రాజేష్(36) దంపతులు. 13ఏళ్ల కుమార్తె, 8ఏళ్ల కొడుకుతో కలిసి కర్ణాటకలోని సింధునూరులో నాలుగేళ్లుగా నివసిస్తున్నారు. ఇటీవల దీపావళి పండుగకు కాకినాడ జిల్లా తూరంగిలోని అత్తారింటికి వచ్చారు. భర్త తన సొంతూరు కాజులూరు మండలం శీల వెళ్లాడు. ఈనెల 4న దేవి అక్క కొడుకు, చెల్లితో కలిసి కాకినాడ కుళాయిచెరువు పార్కుకు వెళ్లారు. అక్కడ దేవి తనకు బావ వరసున్న వ్యక్తితో మాట్లాడుతుండగా ఆమె మరిది చూసి తన అన్న రాజేష్‌తో చెప్పాడు. దీంతో శుక్రవారం శీల నుంచి తూరంగి ఏఎస్ఆర్ కాలనీలోని అత్తారింటికి బియ్యంమూటను తీసుకొచ్చిన రాజేష్ భార్యను ఆ విషయంపై నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో తన వద్ద ఉన్న కత్తితో పీకపై కోశాడు. అనంతరం రాజేష్ రాత్రి 7గంటల సమయంలో తాళ్లరేవు మండలం పటవల పొలాల్లోకి వెళ్లి పురుగులమందు తాగి అనంతరం తన వద్ద ఉన్న కత్తితో పీక కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కోరంగి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. దేవికి పీక వద్ద నుంచి భుజంవరకూ తీవ్రమైన గాయం కావడంతో ఆమె తల్లి వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. ప్రస్తుతం చికిత్స పొందుతుందని, ఆమె స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు పేర్కొన్నారు. దేవి తండ్రి కుడుపూడి వీరవెంకటసత్యనారాయణ కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగి. ఆయనకు ముగ్గురు కుమార్తెలుండగా దేవి మూడో సంతానం.

రంజిత మృతిపై 5 బృందాలతో దర్యాప్తు

రామచంద్రపురంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కోనసీమ జిల్లా ఎస్పీ

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మృతిచెందిన మైనరు బాలిక రంజిత మృతిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం రామచంద్రపురం త్యాగరాజ నగర్‌లో రంజిత మృతి చెందిన గదిని, పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కేసు దర్యాప్తు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నామన్నారు. డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో 5 బృందాలతో దర్యాప్తు జరుగుతుందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిగిందని, ఫోరెన్సిక్ పరిశీలనకు నమూనాలు పంపడం జరిగిందన్నారు. సాంకేతిక ఆధారాల కోసం ఎదురుచూస్తున్నామని వాటితో పాటు వివిధ కోణాల్లో లభించిన ఆధారాలను విశ్లేషణ జరిపి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. బాలిక తల్లితండ్రులు వ్యక్తంచేసిన అనుమానాలు కూడా పరిగణలోకి తీసుకుని దర్యాప్తు జరుగుతుందన్నారు. అంతకుముందు సంఘటనా స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. రంజిత మృతి చెందిన గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. సమీపంలో ఉన్న ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో ఘటకు సంబంధించిన విషయాలపై ఆరా తీశారు.


విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా

చిట్టీల వ్యాపారి ఆత్మహత్య


బాల్య (ఫైల్)

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్టీల వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటపాకకు చెందిన భూక్యా బాల్య (60) కొంతకాలంగా తెలంగాణలోని భద్రాచలంలో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ముందుగా చిట్టీలు పాడుకుని నగదు తీసుకున్న సభ్యులు తిరిగి నగదు చెల్లించకపోవడం, మిగతా సభ్యులు కూడా బాల్యపై ఒత్తిడి తెచ్చారు. సుమారు రూ.5కోట్ల వరకు చిట్టీల నగదు వసూలు అవ్వక అప్పులతో నష్టపోయాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. చికిత్స పొందుతూ బాల్య మృతిచెందాడు. అతడి కుమారుడు కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదానికి గురైన యువకుడు


మోటార్‌సైకిల్

నిడదవోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోజువారీ కోత మిషన్‌పై పనిచేసే ముగ్గురు యువకులు తెల్లవారుజామున టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చి బ్రిడ్జి డివైడర్‌ను ఢీ కొనడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సమిశ్రగూడెం బ్రిడ్జిపై శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరం మార్కొండపాడుకు చెందిన యువకులు మోటారుసైకిల్‌పై విజ్జేశ్వరం వెళ్లి తిరిగివస్తుండగా సమిశ్రగూడెం ఓవర్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ సంఘటనలో చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన నామన కోట సత్యనారాయణ (సత్తిపండు) (28) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మల్లవరానికి చెందిన నాగిరెడ్డి మంగేష్కర్, అరిగెల సాయిదుర్గ గాయాలపాలయ్యారు. గాయపడిన నాగిరెడ్డి మంగేష్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం ఏఎస్ఐ చిన్నయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మంగేష్కర్, సాయిదుర్గను మెరుగైన వైద్యసేవల నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో మృతుడు, గాయపడిన ఇద్దరు యువకులు అవివాహితులే.

అనాథ శవానికి అంత్యక్రియలు

అంబాజీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాకలగరువు పుష్కరఘాట్ వద్ద సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఈనెల 4న లభ్యమైన విషయం తెలిసిందే. ఈ మృతదేహాన్ని గుర్తించి ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని 72 గంటల పాటు మార్చురీలో ఉంచి అన్ని పోలీస్‌స్టేషన్లకు, సోషల్‌మీడియాలో సమాచారాన్ని అందించారు. అయితే బంధువులు, కుటుంబ సభ్యులు ఎవ్వరూ రాకపోవడంతో పోలీసులు అంబాజీపేట నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల వెంకటసుబ్బారావుకు సమాచారం అందించారు. దీంతో పోలీసుల సమక్షంలో అమలాపురం మున్సిపల్ కైలాస భూమిలో శుక్రవారం సాయంత్రం అనాథ శవానికి అంత్యక్రియలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగాబత్తుల సుబ్బారావు ట్రస్టు తరుపున గతంలో పది మందికి పైగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావును పలువురు అభినందించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కాలువలో వ్యక్తి మృతి

గండేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు సమీపంలో ఉన్న పోలవరం కాలువలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన యడాల దుర్గాప్రసాద్ (21) ఈనెల 5న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం తాళ్లూరు సమీపంలో పోలవరం కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారం రావడంతో వెళ్లిచూడగా దుర్గాప్రసాద్ మృతదేహంగా గుర్తించారు. దుర్గాప్రసాద్ కాలువలో కాలు జారి పడిపోయి ఉండొచ్చని వారు ఫిర్యాదు ఇవ్వడంతో గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలేరులో తగ్గుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తుఫాను తర్వాత తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుంచి 1375 క్యూసెక్కుల నీరు వచ్చింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్లస్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 85.58 మీటర్ల స్థాయిలో 22.12 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతానికి 1200 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

'ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్'


అమలాపురంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

అమలాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్‌పై రివ్యూ పిటీషన్ వేసేవిధంగా చొరవ చూపాలని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. విద్యారంగ సమస్యలపై శుక్రవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, అల్లవరం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వీసు రూల్స్ పరిష్కరించి పదోన్నతులు కల్పించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలతో పాటు ఇతర బకాయిలను చెల్లించాలన్నారు. తక్షణం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం ఐర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2027లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫ్యాప్టో పక్షాన శాసన మండలిలలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని వినిపించే వారిని ఎన్నుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, మండలశాఖల ప్రతినిధులు నంద్యాల గురునాయుడు, రత్నంరాజు, తోట బాలకృష్ణ, యాళ్ల జ్యోతికుమార్, ప్రభాకర్, కోలా వెంకటశ్రీనివాస్, రాజేష్, చిన్నం రాంబాబు, శ్యామలరావు, దివాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన


ఆసుపత్రిలో రోధిస్తున్న కుటుంబసభ్యురాలు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన మలిరెడ్డి భూచక్రం (60) శుక్రవారం రాత్రి సామర్లకోట ఆసుపత్రిలో మృతిచెందాడు. ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల కింది స్థాయి సిబ్బంది అరకొర వైద్యం చేయడంతో భూచక్రం మరణించాడని అతడి బంధువులు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రాత్రి ఆందోళనకు దిగారు. స్థానిక వేణుగోపాల స్వామి గుడి ప్రాంతానికి చెందిన మలిరెడ్డి భూచక్రం గుండెల్లో నొప్పి వస్తుందని శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రికి రాగా డాక్టర్ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది డ్యూటీ డాక్టర్ ఫోన్‌లో చెప్పిన సమాచారంతో ఒక ఇంజెక్షన్ చేయగా నొప్పి మరింత పెరిగింది. దీంతో మరో ఇంజెక్షన్ చేసే ప్రయత్నంలో భూచక్రం మృతిచెందినట్టు సమాచారం. దీంతో మృతుడి బంధువులు డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో అవినీతికి పాల్పడిన అధికారులపై కొరడా ఝుళిపిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఆదేశాలు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు, కాతేరు, హుకుంపేట, పిడింగొయ్యి గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగం, అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలకు సంబంధించి 2020-2024లో లోకాయుక్తకు రెండు ఫిర్యాదులు వచ్చాయి. మచిలీపట్నానికి చెందిన జె.శ్రీనివాసగౌడు దాఖలు చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రామాలకు చెందిన అధికారులు కేపీ చంద్రశేఖర్, పి.సురేష్‌బాబు, బి.రామశ్రీనివాస్, డి.విజయరాజుతో పాటు మరికొందరిపై ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత లోకాయుక్త పదవీ ఖాళీగా ఉండడంతో ఉప లోకాయుక్త రజని కేసును విచారించారు. సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది. ఇతర అధికారులైన రామ ప్రసాద్‌రావు, బెన్హర్ ఎడ్వర్డ్, రామ్మోహన్‌రావు, మహేశ్వరప్రతాప్, శ్రీనివాసరావు, సుభాషిణిపై కూడా చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆరోగ్య రాజమహేంద్రవరాన్ని సాధిస్తాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి.. ఎఫ్ఆర్‌యూకు రూ.10 లక్షల వ్యయంతో పరికరాల అందజేత



తుమ్మలోవ ఎఫ్ఆర్‌యూకు అందించిన పరికరాలతో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రాజమహేంద్రవరాన్ని సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అందులో భాగంగా పీహెచ్‌సీలు, ఎఫ్ఆర్‌యూలను బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రాజమహేంద్రవరం తుమ్మలోవలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్(పాలాసుపత్రికి) ఐడీబీఐ సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను శుక్రవారం ఎమ్మెల్యే వాసు, కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ప్రారంభించారు. ఈ సందరభంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు నగర ప్రజలకు తానిచ్చిన కొన్నిడిక్లరేషన్స్‌లో ప్రధానమైనది ఆరోగ్య రాజమహేంద్రవరమని, దానిని సాధించేందుకు జిల్లా ఆసుపత్రిని, యూహెచ్‌సీలను బలోపేతం చేస్తున్నామన్నారు. తుమ్మలోవలో పాలాసుపత్రిగా ఎంతో మంచి సేవలందించేదని, అయితే గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైందన్నారు.కూటమి వచ్చాక కార్పొరేషన్ నుంచి రూ.10 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించామని, తాజాగా ఐడీబీఐ సహకారంతో రూ.10 లక్షలతో డెలివరీ కేసులకు సంబంధించిన అధునాతన పరికరాలు సమకూర్చామన్నారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్రాంచ్ మేనేజరు కళ్యాణ్ దీప్ దాస్, డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్, ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రవి, బాబి, కరగాని వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందంతో మరోసారి సర్వే: ఆర్డీవో



దివాన్‌చెరువులో క్షేత్రసందర్శన చేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

దివాన్‌చెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో నిర్మించనున్న ఫ్లైఓవర్‌కు భూసేకరణకు సంబంధించి ప్రత్యేక బృందంతో మరోసారి సర్వే నిర్వహించనున్నామని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. దివాన్‌చెరువులో ఫ్లైఓవర్‌కు భూసేకరణపై కొంతమంది యజమానుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులును పరిశీలించేందుకు శుక్రవారం ఆయన క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నలుగురు సర్వేయర్లతో ఏర్పాటు చేసే ఈ బృందంలో గతంలో ఇక్కడ భూసర్వే చేసిన అప్పటి మండల సర్వేయరు, ప్రసుత్త మండల సర్వేయరు తోబాటు ఇద్దరు గ్రామ సర్వేయర్లు ఉంటారన్నారు. ఈ బృందం వచ్చే సోమవారం నుంచి సర్వే ప్రారంభిస్తుందని తెలిపారు. సర్వే పూర్తి చేసి స్పష్టమైన నివేదికను వారం రోజులలోగా తమకు అందజేసే విధంగా ఆదేశాలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని కళాశాలల్లో నైపుణ్య శిక్షణ: నన్నయ వీసీ



శిక్షణ ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాలోని అన్ని కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన ప్రాంగణ నియామక శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తిచేసుకున్న 400 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నాందీ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్న తొలి విశ్వవిద్యాలయం నన్నయ అని అన్నారు. ఉన్నత విద్య పూర్తిచేసుకుని కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నపుడు ఈ శిక్షణ ముగింపు కాదని ఆరంభమని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల పాల్గొన్నారు.

వందేమాతరం గీతం.. స్ఫూర్తి మంత్రం



రాజమహేంద్రవరంలో గేయాలాపనలో పాల్గొన్న కమిషనర్ రాహుల్

» రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా
» వందేమాతరం గేయం 150 వసంతాల వేడుకలు
» పలుచోట్ల సామూహిక ఆలాపన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు7(ఆంధ్ర జ్యోతి): వందేమాతరం గేయం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన రణ నినాదమని రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా అన్నారు. బకించంద్ర చటర్జీ వందేమాతర గేయాన్ని రచించి 150 యేళ్లు పూర్తయి న సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం వందేమాతర గేయాలాపన చేశారు. రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వందేమాతర గేయాలాపనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 150 ఏళ్ల క్రితం బకించంద్రచటర్జీ దేశ ఔన్నత్యాన్ని, సామాజిక చైతన్యాన్ని, భౌగోళిక వైవిధ్యాన్ని, భారతమాత శక్తి, సామర్థ్యాన్ని వివరిస్తూ అద్భుతమైన పద జాలంతో ఈ గీతాన్ని రాశారన్నారు. నాటి నుంచి ఈ గీతం స్వాంతంత్ర్య సాధన సంకల్పానికి ఊపిరిపోసిందన్నారు. బ్రిటీష్ పాలకులకు నిద్ర లేకుండా చేసిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా ఈ గేయం ప్రతి ఒక్కరిలోను నిత్య స్ఫూర్తిని రగిలిస్తోందన్నారు. రాబోయే తరాల కోసం ఈ సంస్కార ప్రవాహాన్ని ఇలాగే ముందుకు నడిపించాలని పిలుపునిచ్చా రు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటి కమిషనర్ ఎస్ వెంకటరమణ, అన్నివిభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: కానవరంలోని గాయత్రి విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వం దేమాతరం అక్షర ఆకృతిలో ఆసీనులై వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ మూర్తి, ప్రిన్సిపాల్ దేవి బంగారం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ప్రొవైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో వందేమాతరం గేయం పోరాటయోధులకు అపార స్ఫూర్తినిచ్చిందన్నారు.దీనిలో భాగంగా విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు.కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో పాలిటిక్స్ హెచ్‌వోడీ బీవీబీ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ బకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్రోద్యమానికి నూతన శక్తినందించిందని, మన జాతీయ భావజాలానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ, సూర్యనారాయణమూర్తి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. హుకుంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పీవీఎస్ నారాయణరావు, కె.శ్రీనివాసరావు, కె.రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట హైస్కూల్లో హెచ్ఎం పార్థసారధి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో పి.మధుసూదనరావు విచ్చేసి మాట్లాడారు. దేశభక్తి గీతాలు ఆలపించడం, వాటిలో అంతరార్థాలు తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతర గేయాన్ని ఆలపించారు. అనంతరం తరగతి గదుల్లో ఢిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

అనపర్తి: అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిందని, ప్రతిఒక్కరూ వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలన్న ప్రధాని మోదీ ఆశయంలో పాలుపంచుకోవాలన్నారు. స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వందేమాతర గేయ విశిష్టతను హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు వివరించి, బకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులందరితో వందేమాతర గేయాలాపన చేయించారు. ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమాదేవి, మెళ్లూరులో హెచ్ఎం జి.లక్ష్మి, బలభద్రపురంలో హెచ్ఎం ప్రభాకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు వందేమాతర గేయాలాపన చేయించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వందేమాతర గేయాలపన చేసారని మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వివి. సత్యనారాయణ తెలిపారు.

కడియం: మండలంలోని దుళ్లలో ఎన్టీఆర్ సెంటర్‌లో వందేమాతరం గేయాలాపన జరిగింది. బకించంద్రచటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, తోకల శ్రీనివాసరావు, ఈదర నందబ్బు, సూరపురెడ్డి భరత్, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, చిట్టూరి వెంకన్నచౌదరి, గోపి ప్రసాద్ పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలో పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన వందేమాతర గేయాలాపనలో డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, ఎంఈవో టి.కుశలవ దొర, ఈవోపీఆర్డీ ప్రతాప్,మండల పరిషత్, హౌసింగ్, ఉపాధి హామీ, మహిళా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉద్యోగులు, సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి వందేమాతరం గేయం ఆవశ్యకతను వివరించారు. డిపో మేనేజర్ మాధవ, గ్యారేజీ సూపర్‌వైజర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో వందేమాతర గేయాన్ని ఆలపించారు.కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వందేమాతరం గేయం దేశ ఐక్యతకు, భారతావని పట్ల భక్తి ప్రతీకగా నిలుస్తోందని, గేయంపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా తపాలా స్టాంప్, స్మారక నాణెం విడుదల చేశారన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్లు గోపాల్, ఎ.సుమతి, ఏపీవో బీబీ సత్యవతి, ఏపీఎం జిలానలి టైపిస్టులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ



జిల్లా పోలీసు కార్యాలయంలో గేయాలాపన చేస్తున్న పోలీసులు



కోరుకొండలో గేయాలాపన చేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

అవగాహనతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట

రంగంపేట వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మి
పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

రంగంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అవగాహనతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా సిబ్బందితో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో క్యాన్సర్‌ది రెండో స్థానమన్నారు. బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి మహమ్మారి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోందన్నారు. జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ముందస్తుగా గుర్తింపు, చికిత్సపై అవగాహన పెంచుకోవడం ద్వారా క్యాన్సర్‌ను అడ్డుకోవచ్చన్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గేయాన్ని పీహెచ్‌సీ సిబ్బంది సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు వీజే ఫార్మసీ కళాశాలలో క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంపై విద్యార్థులకు ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి, కరస్పాండెంట్ ఎస్‌వీవీ జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్‌ను దూరం చేయవచ్చన్నారు. చైర్‌పర్సన్ ఎన్.శకుంతల మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకోవడంతోబాటు ధ్యానం లేక యోగ చేయాలని సూచించారు. జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ దీపక్ క్యాన్సర్‌ను ముందస్తుగా ఎలా గుర్తించాలో వివరించారు. మొదటిదశలో గుర్తించడం వల్ల నయం చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బొమ్మూరులోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి స్థానికంగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి మాట్లాడుతూ అనుమానం ఉన్న ప్రతిఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తొలిదశలో క్యాన్సర్ గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎమ్‌వో డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ కరుణశ్రీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లోని స్కూల్ ఆఫ్ ఫార్మసీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్టు అన్నపూర్ణ యల్లా రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసి ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం, నివారణ, చికిత్సలపై అవగాహన కల్పించారు.ఆధునిక చికిత్సతో క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. మహిళల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ల గురించి వివరించారు. దీనిలో భాగంగా క్యాన్సర్ రకాలు, కారణాలు, చికిత్సల రకాలు అనే అంశంపై విద్యార్థులకు రీల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ అధిపతి, జీజీయూ, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.మెహర్ సత్యవాణి, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రూ.7.20 కోట్లతో కెనాల్ రోడ్డు అభివృద్ధి

ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తిలో కెనాల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా మారిన అనపర్తి-బిక్కవోలు కెనాల్ రోడ్డును రూ.7.20 కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని పెట్రోలు బంకు వద్ద ఆయన రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి కెనాల్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అనపర్తిలోని కంటి ఆసుపత్రి నుంచి పెట్రోలు బంకు వరకు, బలభద్రపురం పెట్రోలు బంకు వద్ద, ఆర్ఎస్ పేట వద్ద రోడ్డు కుంగిపోతుండడం, నిర్మాణం చేసినా ఫలితం ఉండకపోతుండడంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అశ్రద్ధ చేయడం వల్ల రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కెనాల్ రోడ్డులో అనపర్తి పరిధిలో రూ.7 కోట్లతో మరమ్మతులు చేశామని, తాజాగా అనపర్తి నుంచి బిక్కవోలు వరకు రూ.7.20 కోట్ల నిధులు మంజూరై టెండరు ప్ర క్రియ కూడా పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈ ఎం.మను, ఏఈ పి.రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రబీకి యూరియా కొరత ఉండదు

బిక్కవోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ప్రారంభానికి రైతులందరికీ యూరియా కొరత లేకుండా చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. పందలపాక సొసైటీలో శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా వందేమాతరం ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలకరి సీజన్‌లో క్వింటా ధాన్యానికి గతం కన్నా రూ.69 ప్రభుత్వం పెంచిందన్నారు.రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలని, మంచి ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు సూచించారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే సొసైటీలకు యూరియా సరఫరా చేస్తామన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మేడపాటి వెంకటరామారెడ్డి పొలాన్ని ఎమ్మెల్యే సందర్శించారు.ఎకరాకు రూ.500 ఖర్చయిందని రైతు తెలపడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ప్రతి రైతు ప్రకృతి వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో సొసైటి అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, పడాల వెంకట్రామారెడ్డి, ఎంపీపీ తేతలి సుమ, డైరెక్టర్ కర్రి సత్యగౌరి, చింతా శ్రీనివాసరెడ్డి, దుర్గారెడ్డి, ఇందల వీరబాబు, ఏడీఏ డీవీ కృష్ణ, ఏవో శామ్యూల్‌జాన్, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్,వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రఘుదేవపురంలో చోరీ

సీతానగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని రఘుదేవపురం గ్రామానికి చెందిన నగేరు చినమంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనం కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ బి.సురేష్ శుక్రవారం తెలిపారు. చినమంగమ్మ కుటుంబ సభ్యులంతా పని కోసం ఇంటికి తాళం వేసి కొన్నిరోజుల క్రితం ఒంగోలు వెళ్లారు.ఈ నెల 4న పగలు ఇంటిలో శబ్దాలు రావడంతో స్థానికులు పరిశీలించగా ఇంటి లోపలి నుంచి ఒక యువకుడు బయకు వచ్చి పారిపోతుండగా అనుసరించారు. వెనుక వీధిలో యువకుడికి సంబంధించిన వ్యక్తి ఇంట్లోకి వెళ్లగా స్థానికులు అతడిని పట్టుకున్నారు.ఈ విషయాన్ని మంగమ్మ మేనల్లుడు వెంకన్నకు ఫోన్ ద్వారా తెలుపగా ఇంటికి వచ్చి చూడగా ప్రవేశ ద్వారం, లోపలి తలుపులు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా బంగారు మేటీలు, ఉంగరం, జత దుద్దులు, రెండు జతల వెండి పట్టీలు పోయాయని గుర్తించారు. దొంగతనానికి పాల్పడిన యువకుడు స్టీఫెన్‌పాల్‌పై ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ట్రైనీ ఎస్ఐ తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని 9వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతతో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా రిస్టోరేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, డీఈ లోవరాజు, ఏఈ దుర్గాప్రసాద్, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

కిచెన్ గార్డెన్ విత్తనాలు ఉచిత పంపిణీ

సీతానగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) మండల సమాఖ్య, ఎఫ్‌పీవో, ఏపీ సీఎన్ఎఫ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మునికూడలి గ్రామంలో కిచెన్ గార్డెన్ విత్తనాలు, మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం జిలాని మాట్లాడుతూ ఎరువులు పురుగు మందులు వాడకుండా తయారు చేసిన ఆరోగ్యకరమైన 15 రకాల విత్తనాలు, 4 రకాల మొక్కలు పంపిణీ చేశామని, వాటిని ఇళ్లలో పండించుకుని తిని ఆరోగ్యవంతమైన జీవించాలన్నారు. దాతలు ఎంవీ రామారావు, ప్రత్తిపాటి వరలక్ష్మి, సాదే రోజ్‌లిన్, ఓష్‌లిన్, ఎన్‌టీఆర్ సేవాసమితిల సహకారంతో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోరుకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎవరైనా దౌర్జన్యాలకు, చోరీలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని సీఐ వై.సత్యకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మండలంలోని మోర్త వెంకటేష్‌పై పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. వెంకటేష్ వివిధ రకాల చోరీలు, అనేక సంఘ వ్యతిరేక నేరాలకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. 46 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, కౌన్సిలింగ్ ఇచ్చినా వైఖరి మార్చుకోకపోవడంతో పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ విద్యార్థుల స్నాతకోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్ డే అనేది విజయానికి ఒక వేడుక మాత్రమే కాదని, ఆలోచించే క్షణమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఎస్.ప్రసన్న శ్రీ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2018-21, 2019-22 సంవత్సరాల డిగ్రీ విద్యార్థులకు కళాశాల ఎగ్జామినేషన్ విభాగం ఆధ్వర్యంలో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2,349 ఒరిజనల్ డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది కఠినమైన అభ్యాసానికి ముగింపును సూచించడంతోపాటు ప్రతిఒక్కరి కోసం వేచి ఉన్న కొత్త సవాళ్లు, అవకాశాలకు నాంది పలుకుతుందన్నారు. కళాశాల విద్యాశాఖ సీసీఈ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ కె.బాబు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డీవీఎన్ శ్రీరామ్మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

ఎల్ఐసీ ఏజెంట్లు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఐకమత్యంతో ముందుకెళితేనే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం రూరల్ శాఖ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా తెలిపారు. శుక్రవారం పిడింగొయ్యి గ్రామంలో మట్టా సత్యనారాయణ పొలంలో ఎల్ఐసీ ఏజెంట్లు కార్తీక వనసమారాధన జరిగింది. బ్రాంచి మేనేజర్ రఘుకుమార్, ఏబీఎం అబ్రహం, విస్తరణాధికారి వై.కాశీవరప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రతీ ఏజెంటు కలిసి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ద్వారా ఐకమత్యం పెంపొందుతుందన్నారు. ఎల్ఐసీ ఏజెంట్లు సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగులను, ప్రతిభ చూపిన ఏజెంట్లను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

తల్లీకొడుకుల అదృశ్యం



రాజానగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన నేరుకొందుల వెంకరమణ భార్య 25 ఏళ్ల మంగాదేవి తన నాలుగేళ్ల కుమారుడు దుర్గాప్రసాద్‌తో కలిసి అదృశ్యమైనట్టు రాజానగరం పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. ఈ నెల 6న ఉదయం 9గంటలకు శ్రీకృష్ణపట్నం గ్రామం నుంచి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఇంటి పరిసర ప్రాంతాల్లోనూ, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చామన ఛాయ రంగు కలిగిన ఈమె ఇంటి నుంచి వెళ్లిన సమయంలో పంజాబీ డ్రస్సు ధరించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజానగరం పోలీస్ స్టేషన్ 94407 69585, 94410 23561 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆర్యన్
సూర్యమినీ	: ఫీనిక్స్
సూర్యప్యాలస్	: ప్రెడేటర్
స్వామి	: జటాధర
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమిస్తున్నా, కె-ర్యాంప్
శివజ్యోతి	: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
రాజా	: జటాధర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కృష్ణలీల
రంభ	: ప్రెడేటర్
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహల్(నామవరం)	: ప్రెడేటర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది గర్ల్ ఫ్రెండ్
వెంకటసూర్య(కడియం)	: జటాధర
సత్యగౌరి (అనపర్తి)	: జటాధర
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్







వందే..ఈ తరం!

ఆ గీతం అజరామరం.. ఏ తరమైనా ఆ గీతం ఆలపించాల్సిందే.. దేశభక్తిలో మునిగి తేలాల్సిందే.. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఊరూవాడా కదిలింది.. వందేమాతరం గీతం ఆలపిస్తూ తమలోని దేశభక్తిని చాటుకున్నారు.. కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్, డీఆర్‌వో సీతారామ్మూర్తి వందేమాతర గీతం ఆలపించారు. తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇలా వందేమాతరం ఆకారంలో కూర్చుండిపోయారు. బిక్కవోలు మండలం పందలపాక హైస్కూల్లో విద్యార్థులు వందేమాతర గీతం ఆలపించారు. - రాజమహేంద్రవరం సిటీ



విజ్ఞానం.. వినోదం

అదొక అద్భుతం.. అది మరో ప్రపంచం.. ఎంత చూసినా తనివితీరదు.. ఎక్కడికెళ్లామో తెలియదు.. ఏం చేశామో గుర్తురాదు.. అదొక మాయాప్రపంచమే.. మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోంది.. అందుకే సెలవు రోజు వచ్చిందంటే చాలు విద్యార్థులు రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో ఉన్న సైన్స్ మ్యూజియానికి క్యూకట్టేస్తున్నారు.. నామమాత్రపు రుసుంతో ప్రవేశానికి అవకాశం కల్పించడంతో వేలాదిగా తరలివస్తున్నారు..శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు.. మ్యూజియం అణువణువు తిలకించారు. అబ్బా ఎంత బాగుందో అంటూ ఆశ్చర్యానికి లోనయ్యారు.. జూన్ నుంచి ఇప్పటి వరకూ 25 వేల మంది విద్యార్థులు విజ్ఞాన కేంద్రం సందర్శనకు వచ్చినట్టు డీఈవో తెలిపారు.
- రాజమహేంద్రవరం

శ్రీరంగపట్నం,ముక్కామల కార్యదర్శుల సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఫోన్ నెంబర్ల మ్యాపింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు గ్రేడ్-3 కార్యదర్శులను సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి ఉత్తర్వులు విడుదల చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పంచాయతీలో గ్రేడ్-3 కార్యదర్శిగా పనిచేస్తున్న కె.శాంతిప్రసన్న గ్రామంలోని ఇంటి పన్నులకు సంబంధించి 2155 ఎసెస్‌మెంట్లు ఉండగా 1158 ఎసెస్‌మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో మ్యాపింగ్ చేసినట్టు గుర్తించారు. కొవ్వూరు డివిజన్ పరిధి పెరవలి మండలం ముక్కామల గ్రామ పంచాయతీలో గ్రేడ్-3 కార్యదర్శిగా పనిచేస్తున్న పి.పవన్ కుమార్ గ్రామం పరిధిలో 1488 ఎసెస్‌మెంట్లకు 372 ఎసెస్‌మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో మ్యాపింగ్ చేశారు. దీంతో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు.

నియోజకవర్గాల వారీ విజన్ యాక్షన్ ప్లాన్

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విజన్ యాక్షన్ ప్లాన్ 2047లో భాగంగా జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంవారీ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక వనరులు, మానవ మూలధనం, పరిశ్రమలు, వ్యవసాయ సామర్థ్యం, పర్యాటక అవకాశాలను పరిగణనలోకి తీసుకుని సెక్టార్ వారీ విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త విధానంలో మహిళా సంఘాలు,యువజన సంఘాలతో చర్చలు జరిపి సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. ఉపాధి అవకాశాలు, పరిశ్రమల గ్రౌండింగ్, ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 2029కి ముందే నగర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో మెరుగుపరచే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీపీవో ఎల్.అప్పలకొండ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత,ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



నేరము..శిక్ష!

ఈయనెవరో తెలుసా.. ఈ సీన్ చూస్తుంటే రోడ్డు పక్కన నిలబడి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నట్టు ఉంది కదూ.. మీరూహించింది నిజమే.. కానీ అతను ట్రాఫిక్ కానిస్టేబుల్ కాదండోయ్.. పెరవలి మండలం కాపవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రామకృష్ణ బహిరంగంగా మద్యం సేవించి అందరినీ ఇబ్బందిపెడుతుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రూ.200 జరిమానాతో పాటు 2 గంటల పాటు ప్రభుత్వ కార్యాలయంలో సేవలందించాలని జడ్జి తీర్పుఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ పెరవలి హైవేపై ట్రాఫిక్ డ్యూటీ చేయించినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. - పెరవలి



మూడున్నరేళ్లు దాటేసినా..

జయమేది!

నేటికీ తేలని జయలక్ష్మి సొసైటీ కేసు

కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డిపాజిటర్లు ఇందులో డబ్బులు పొదుపు చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బిచాణా ఎత్తేసింది. బాధితులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. కేసు విచారణలో భాగంగా కుంభకోణానికి ప్రధాన సూత్రదారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లను సీఐడీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించింది. వీరికి సంబంధించిన రూ.450 కోట్ల విలువైన 98 స్థిరాస్తులను సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాల్సి ఉన్నా ఇదేదీ జరగడం లేదు. కేసు రాజమహేంద్రవరంలోని పీడీజే న్యాయస్థానంలో కొనసాగుతుండగా పదేపదే కేసులో సీఐడీ వాయిదాలు కోరుతోంది. దీంతో వేలం ప్రక్రియ ఎప్పటికీ జరుగుతుందో అంతు పట్టడం లేదు. బాధితులకు న్యాయం చేసేందుకు సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తు లను వేలం వేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేలం ప్రక్రియ ముందుకు సాగేలా సీఐడీని ప్రభుత్వం ఆదేశించింది.కానీ సీఐడీ చొరవ చూపడం లేదు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)
రూ.582 కోట్ల జయలక్ష్మి సొసైటీ స్కాం బాధితులకు న్యాయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. సీజ్ చేసిన ఆస్తులు వేలం వేసి న్యాయం చేసేందుకు సీఐడీ ప్రయత్నించడం లేదు. పదే పదే కేసులో వాయిదాలు కోరుతూ బాధితులను ముప్పుతిప్పలు పెడుతోంది. స్కాం సమయంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్ల నగదు విడుదల చేయాల్సి ఉన్నా అదీ చేయడంలేదు. తాజాగా సొసైటీకి రుణ వసూళ్ల కింద జమయిన రూ.7.50 కోట్లు సీఐడీ ఏకంగా ఫ్రీజ్ చేసేసింది. వీటిని బాధితులు పంచుకోకుండా అకౌంట్లు స్తంభింపచేసింది.అదే సమయంలో పులిమీద పుట్రలా స్కాంకు ముందు నిందితులు జరిపిన లావాదేవీల ఆధారంగా రూ.15 కోట్లు పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ ప్రస్తుత సొసైటీకి ఇటీవల నోటీసులు జారీ చేసి షాక్ ఇచ్చింది. నిందితుల ఆస్తులు వేలం వేసి డబ్బులు ఇవ్వాలని విజయవాడ కోపరేటివ్ ట్రిబ్యునల్ కేసులూ కొలిక్కిరావడం లేదు. ఇప్పట్లో న్యాయం జరిగే అవకాశాలు క్రమేపీ క్షీణించుకుపోతుండ డంతో చిన్న డిపాజిటర్లు లబోదిబోమంటున్నా రు.ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

డిపాజిట్‌దారులు 21,895

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి చెల్లించాల్సిన మొత్తం రూ.511 కోట్లు ఉంది. రూ.లక్షలోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా రూ.32.72 కోట్లు చెల్లిం చాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 నుంచి రూ.4 లక్షల లోపు 810మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు,రూ.5లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది.

కేసులపై కేసులు దాఖలు..

నిందితులు,రుణగ్రహీతల ఆస్తులు వేలం వేసి తమకు ఆ డబ్బు ఇవ్వాలంటూ విజయవాడలోని డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ట్రిబ్యునల్‌లో బాధితుల తరపున సొసైటీ సభ్యులు ఇప్పటి వరకు 13 కేసులు దాఖలు చేశారు.తాజాగా మరో 30 కేసులు దాఖలు చేశారు.ఈ కేసులకు సంబంధించి ఆస్తుల విలువ రూ.70 కోట్లు ఉంది. వీటిపై తుది తీర్పు వస్తే కొంత వరకు నగదు తిరిగొచ్చే అవకాశం ఉంది.ఈ డబ్బొస్తే చిన్న బాధితులకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నా ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి.

ఆ డబ్బూ సీజ్...

సీజ్ చేసిన ఆస్తుల వేలానికి సీఐడీ చొరవ చూపకపోగా..గతంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్లు విడుదల చేయడానికి సీఐడీ ఆసక్తి చూపడం లేదు.తాజాగా సొసైటీకి మరోషాక్ ఇచ్చింది. కుంభకోణం తర్వాత ఏర్పడ్డ కొత్త పాలకవర్గం రుణాలు తీసుకున్న వారిని గుర్తించి రూ.7.50 కోట్లు రాబట్టింది. దీంతో చిన్న డిపాజిటర్లకు చెల్లించి న్యాయం చేస్తారని భావించారు. కానీ ఈలోపు సీఐడీ షాక్ ఇచ్చింది. కొన్ని రోజుల కిందట ఈ నగదును సీజ్ చేసేసింది. దీంతో ఇప్పుడు బాధితులు లబోదిబోమంటున్నారు. మరోపక్క కుంభకోణానికి ముందు నిందితులు రెండు పాన్ కార్డులు వినియోగించారు. ఒకటి ఇప్పటికీ నడుస్తుండగా..మరొకటి వినియోగంలో లేదు. 2017-2018 నాటి సొసైటీ కోట్ల రూపాయల లావాదేవీల ఆధారంగా ఇప్పుడు రూ.15 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాలంటూ ఐటీ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడున్న పాలకవర్గానికి షాక్ తగిలినట్లయింది. ఒకపక్క సీఐడీ, మరోపక్క ఐటీ నుంచి ముప్పేట దాడి జరుగుతుండడంతో ప్రస్తుతం పాలకవర్గం నెత్తీ నోరు బాదుకుంటోంది.

- మూడున్నరేళ్లుగా సాగదీత
- సీఐడీకి అప్పగించినా తుస్
- వాయిదాలతో కాలయాపన
- రూ.450 కోట్ల ఆస్తులు సీజ్
- వేలంపై ఎడతెగని జాప్యం
- తాజాగా అకౌంట్లలో నగదు సీజ్
- 43 కేసులు దాఖలు

పంచాయతీల్లో డిజాస్టర్ వలంటీర్ల నియామకం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముంపు నివారణ చర్యలకు సమగ్ర ప్రణాళిక అవసరమని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె జేసీ మేఘాస్వరూప్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. మొంథా తుఫాన్ వల్ల పంటలు ముంపునకు గురికావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇక భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బుష్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మేజర్, మైనర్, స్మాల్ ఇరిగేషన్, పంచాయతీ రాజ్ చెరువుల స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ముంపు నివారణ చర్యలకు గ్రామ స్థాయిలో స్వచ్ఛంద డిజాస్టర్ వలంటీర్లను నియమించాలని సూచించారు. వారు చెరువుగట్ల పటిష్టతపై నివేదిక ఇవ్వాలన్నారు. వచ్చేవారంలో తహశీల్దార్లు, ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో నోటిఫికేషన్ జారీ చేసి విలేజ్ డిజాస్టర్ వలంటీర్ల నియమిస్తామన్నారు.చెరువుల గట్లు నిరంతరం తనిఖీ చేయడం నివేదికలు సమర్పించడం, నీటి వినియోగదారుల సంఘాలు, డిజాస్టర్ వలంటీర్లకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇరి గేషన్ సీఈ శేషుబాబు, ఎస్‌ఈ కె. గిరిధర్, డీఈ జి.మనోజ్‌కుమార్, ఎర్రకాలువ ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత 7
డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి 8



గోదారి మారుతోంది!

రాజమహేంద్రవరంలో సాగుతున్న గోదావరి ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు

అఖండ గోదావరి ప్రాజెక్టు పనుల్లో కదలిక

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. పుష్కరఘాట్ అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి.2026 మార్చి నాటికి పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. హేవలాక్, కడియపులంక నర్సరీల మధ్య ఎక్స్‌పీరియన్స్ సెంటర్, నిడదవోలులో కెనాల్ టూరిజం పనులకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ఆరంభించనున్నారు. ఇదిలా ఉండగా అఖండ గోదావరి ప్రాజెక్టు ఈడీ ఎం.శేషగిరిరావు శుక్రవారం పనులను పరిశీలించి సూచనలు చేశారు ఈ అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్ 26న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. సుమారు రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పుష్కర ఘాట్ అభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. మార్చి నాటికి ఘాట్ పనులు పూర్తవుతాయని ఈడీ శేషగిరిరావు తెలిపారు.

- ఇప్పటికే పూర్తయిన టెండర్లు
- వేగంగా పుష్కరఘాట్ పనులు
- మిగిలినవి త్వరలో ప్రారంభం
- మారనున్న హేవలాక్ వంతెన

పుష్కరాలకు ముందే ఇలా..

2027 పుష్కరాలకు ముందే అఖండ గోదావరి ప్రాజెక్టును సిద్ధం చేసి సుమారు 8 వేల మంది యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి-2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్) స్కీమ్ ద్వారా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును నిర్మించ నున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య గోదావరిపై మొదటి రైలు వంతెన హేవలాక్ బ్రిడ్జి టూరిజం హబ్‌గా రూపుదిద్దుకోనుంది. 127 ఏళ్ల చరిత్రగల ఈ బ్రిడ్జి పర్యాటకులకు వేదికగా మారనుంది. 2.7 మీటర్ల పొడవు ఉన్న ఈ బ్రిడ్జికి 54 స్పాన్‌లు ఉన్నాయి. అందులో 25 స్పాన్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయ డానికి నిర్ణయించారు. ఇక వంతెన 18వ స్పాన్ వద్ద గోదావరిలో ఉన్న 120 ఎకరాల బ్రిడ్జి లంకలో టెంట్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. హేవలాక్, పుష్కరఘాట్లను అనుసంధానం చేయనున్నారు. కడియం నర్సీలను టూరిజం స్పాట్‌గా, ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా తీర్చిదిద్ద నున్నారు. కడియపులంక, పొట్టిలంక, పరిసర నర్సరీల చుట్టూ పర్యాటక సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ కాలువలో బోటింగ్ ఏర్పాటు చేయనున్నారు.నిడదవోలులోని చారిత్రక కోట సత్తెమ్మ ఆలయానికి కొత్త శోభ తేనున్నారు. యాత్రికులకు అదనపు వసతి గృహాలు ఏర్పాటు చేస్తారు.ఆలయ రాజ గోపురం ఆధునికీకరించనున్నారు.సమిశ్రగూడెం వద్ద గోదావరి కాలువలో నిత్యహారతి ఘాట్ ఏర్పాటు చేయనున్నారు. బోటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు.

మార్చికి పుష్కరఘాట్ సిద్ధం : ఈడీ

పుష్కరఘాట్ పనులు మార్చి నెలాఖరుకి పూర్తి చేయనున్నట్టు ప్రాజెక్టు ఈడీ ఎం. శేషగిరిరావు తెలిపారు.ఈఈ రెడ్డి, డీఈ సత్య నారాయణ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం పుష్కరఘాట్‌లో పనులు పరిశీలించి, అధికారులు, డిజైనర్లకు పలు సూచనలు చేశారు. హేవలాక్ బ్రిడ్జి, నిడదవోలు, కడియపులంకకు ప్రాంతానికి సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



వక్తృత్వ పోటీల్లో విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత తదితరులు

ప్రతి ఒక్కరికీ సమన్యాయం

ఉమ్మడి జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమన్యాయం, సమాన హక్కులను పొందేలా చూడడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని..రాజీ మార్గమే రాజ మార్గమనే నినాదంతో న్యాయ సేవలు సంస్థ అందిస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైరపర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ న్యాయ సేవా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని 39-ఏ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడు న్యాయ సహాయం పొందే హక్కు కలిగి ఉన్నారన్నారు. అందరికీ సమాన హక్కులు, సమన్యాయం లభించాలని 1, 14, 22 ఆర్టికల్స్ స్పష్టం చేస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 867 మందికి లీగల్ ఎయిడ్ లభించిందన్నారు. 3,513 అవగాహన కార్యక్రమాల నిర్వహణ ద్వారా 1,76,678 మందికి డీఎల్ఎస్ఏ సేవలు లభించాయని చెప్పారు. 1,374 గ్రామాల్లో అవగాహనపై చర్యలు చేపట్టామన్నారు. వృద్ధాశ్రమాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు తదితర చోట్ల పర్యటించి, పరిశీలన చేసి ఆయా కలెక్టర్లతో పాటు హైకోర్టుకు నివేదికలు ఇస్తున్నామన్నారు. గతేడాది డిసెంబరు నుంచి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 20,344 కేసుల పరిష్కారం జరిగిందని, బాధితులకు రూ.కోటి 71 లక్షల 80 వేల పరిహారం అందిందని చెప్పారు. రహదారి భద్రత, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రతినిధి శోభనాద్రి శాస్త్రి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి నింపిన గీతం వందేమాతరం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● వాడవాడలా గీతాలాపనలు



టీడీపీ కార్యాలయంలో వందేమాతర గీతాలాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఇతర అధికారులు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది భారతీయుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన గీతం వందేమాతరమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వందేమాతర గీతం రచించి శుక్రవారంతో 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సామూహిక గీతాలాపన చేపట్టారు. ముందుగా గీత రచయిత బంకించంద్ర చటోపాధ్యాయకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాజ్య స్థాపనకు స్వాతంత్ర్య సమరయోధులు ఎందరో ఈ గీతాన్ని ఆలపించారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, ఆళ్ల హరిబాబు, చావా శ్రీనివాసరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, బేతిన నారాయణ, సుంకర సత్తిబాబు, తిగిరిపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ సుమంత్ ఆధ్వర్యంలో సామూహిక గీతాలాపన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆధ్వ ర్యంలో బంకించంద్ర చటోపాధ్యాయకు నివాళి అర్పించారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మేనేజర్ భరత్, ఆర్ఐ డీ.శ్యామ్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో..

ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణీసుస్మిత ఆధ్వర్యంలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీత రచయిత బంకించంద్ర చటోపాధ్యాయకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో, పంగిడి జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం ఎం. శ్రీరామారావు ఆధ్వర్యంలో సామూహిక వందేమాతర గీతాలాపనలు నిర్వహించారు.

మున్సిపల్ హైస్కూల్లో ..

స్థానిక మున్సిపల్ హైస్కూల్లో బీజేపీ ఆధ్వర్యంలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు. జాతీయ గీత రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, తాడిమళ్ల విజయవాణి, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణం, మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో వందేమాతరం గీతానికి 150 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సామూహికంగా వందేమాతర గీతాలను ఆలపించారు.

పెరవలి: వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని అన్నిప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ గీతాన్ని బెంగాళీ రచయిత బకించంద్ర చటర్జీ రచించారని, ఇది ఎంతో ప్రాముఖ్యత సాధించిందన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఆయా సచివాలయాల వద్ద గీతాలాపనలు జరిగాయి.

తాళ్లపూడి: తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందేమాతర గీతం 150 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఘనంగా గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ బకించంద్ర ఛటోపాధ్యాయ రచించారన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో వందేమాతరం 150 ఆకృతిలో కూర్చుని అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: ప్రతి భారతీయుడు వందే మాతరగీతాన్ని ఆలపించాలని తహశీల్దార్ సాయి ప్రసాద్ అన్నారు. వందేమాతర గీతం 150వ సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వాదేశానుసారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులచే వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయాశాఖాధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి: వందేమాతర గీతాన్ని ప్రతిఒక్కరూ ఆలపించాలని మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు, దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో వందేమాతర గీతాన్ని 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో గీతాన్ని ఆలపించారు. ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, ఎంఈవోలు తిరుమల దాసు, అప్పారావు, ఎన్.రవికిషోర్, స్థానికులు, చైతన్యస్కూల్ ప్రిన్సిపాల్ జీ. వినూత్న, టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తుడు బకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తి ఇచ్చిందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో కె. ఆంజనేయశర్మ, ఏవో బీ రాజారావు, ఎంపీడీవో ఆఫీసు ఏవో వీఎస్ రామారావు, ఎంఈవో సక్సేన రాజు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో ...



పెరవలి ఎంపీడీవో కార్యాలయం వద్ద ...



ఉండ్రాజవరం 1- తహశీల్దార్ కార్యాలయంలో ..



దేవరపల్లి సొసైటీ వద్ద ...

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 12 ఫిర్యాదులు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చూసుకుంటూ వెళ్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ముప్పిడి పాల్గొని ప్రజల నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు, నామాన పరమేశ్వరరావు, బేతిన నారాయణ, గారపాటి వెంకటకృష్ణ, కలగర సుబ్బారావు, బొల్లిన శివనాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం : డీసీహెచ్ఎస్



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించినట్టు డీసీహెచ్ఎస్ డా.ఎం. పద్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవనశైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయన్నారు.

ఉండ్రాజవరం: ప్రజల్లో కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు.సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత : శాప్ డైరెక్టర్



బహుమతులు అందిస్తున్న ధనుంజయుడు

దేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ పేర్కొన్నారు. దుద్దుకూరు రంగరాయ జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర అంతర్ జిల్లాల సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ అండర్-17 బాల, బాలికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త కరుటూరి ధనుంజయుడు పాల్గొని మాట్లాడుతూ సెపక్‌తక్రా పోటీల్లో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనటం జరిగిందన్నారు. ఈ పోటీల్లో బాలికల్లో కృష్ణాజిల్లా ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో అనంతపూర్, అలాగే అండర్-17 బాలుర సెపక్‌తక్రా పోటీల్లో ప్రథమస్థానం కృష్ణా జిల్లా, ద్వితీయస్థానంలో అనంతపూర్, తృతీయ స్థానంలో వెస్ట్‌గోదావరి నిలిచాయని తెలిపారు. వీరిలో జాతీయస్థాయికి బాయ్స్ గర్ల్స్‌ను ఎంపికచేశామన్నారు. బాలికల్లో కావ్య, లావణ్య, మాధురిశ్రీ, చైతన్యరమ్య,బాయ్స్ సెపక్‌తక్రాలో జాకీర్,కుశాల్, రాజు, జాన్‌విక్టర్, వై.ఆంథోని ఎంపికయ్యారన్నారు. టీడీపీ నేతలు కరుటూరి శ్రీరామ్మూర్తి, ముళ్లపూడి దొరాజీ చైదరి, ముళ్లపూడి గంగాధరరావు, కొయ్యలమూడి తాతారావు, కరుటూరి అబ్బులు, కంటి పూడి అశోక్, ఆళ్ల భుజంగరావు, ముళ్లపూడి సత్యనారాయణ, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు మేనేజర్‌గా గంగాధరరావు


చాగల్లు, నవరంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊనగట్ల జడ్పీ హైస్కూల్లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న కొయ్య గంగాధరరావు ఏపీ వాలీబాల్ అండర్-17 విభాగం జట్టుకు మేనేజర్‌గా నియమితులయ్యారు. జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరగనున్నా యి. ఈయన్ని పాఠశాల హెచ్ఎం ఎన్వీ రమణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, ఎస్ఎంసీ అధ్యక్షుడు కామన శివ, తదితరులు అభినందించారు.

పంగిడి జడ్పీ హైస్కూల్లో

స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంగిడి జడ్పీ హైస్కూల్లో (పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో) స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. హెచ్ఎం మంగిన శ్రీరామారావు జెండాను ఆవిష్కరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్‌స్టీఫెన్‌సన్ బేడెన్ పావల్ సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ గౌరవ వందనం స్వీకరించారు. రామారావు మాట్లాడుతూ పాఠశాలలో స్కౌట్స్ సేవలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయన్నారు. స్కౌట్స్ మాస్టార్ వి. అచ్చయ్య, పీడీ పితాని నాగేంద్ర రవికుమార్, సీఆర్‌పీ వెంకటరత్నం, మధులత, రవికుమార్ పాల్గొన్నారు.

సీఎంకి ఆహ్వానపత్రిక అందజేత



ఆహ్వానపత్రిక అందిస్తున్న రామకృష్ణారావు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు తన కుమారుడు సుభాష్, ధాన్య వివాహానికి హాజరుకావాలని సీఎం చంద్రబాబును శుక్రవారం విజయవాడలో కలిసి ఆహ్వానించారు. ఈనెల 13వ తేదీన కాకినాడలో వివాహం జరుగుతుందని ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మంత్రి లోకేష్‌కు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి , తదితరులు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమస్యలను తెలియజేయాలన్నారు. ఇప్పటికే గ్రామ, మండల నూతన కమిటీల ఏర్పాటు పూర్తయిందన్నారు. అలాగే తాళ్లపూడి మండలంలో కమిటీలు వేయాల్సి ఉందన్నారు. ప్రతినెలా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీల సమావేశం నిర్వహించాలన్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీనియర్ నాయకుల సలహాలు తీసుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల సమస్యలు, గ్రామానికి సంబంధించిన సమస్యలపై చర్చించాలన్నారు. తీర్మానాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో అందించి నట్టయితే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు, నామాన పరమేశ్వరరావు, బేతిన నారాయణ, అర్జిల్లి రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాసరావు, గారపాటి రామకృష్ణ, బొల్లిన శివనాగేంద్ర, నీటి సంఘం అధ్యక్షులు గొరిజాల సురేష్, మద్దుకూరి ప్రకాశం, సర్పంచ్ మేకల శ్రీను, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, నాయకులు కేతా సాహెబ్, మరపట్ల కళాధర్, కంటిపూడి శ్రీనివాస్, నందిగం సుధాకర్, యనమదల శివరామకృష్ణ, తోరం నగేష్, వేమగిరి వెంకట్రావు, మూడు మండలాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

అనంతపల్లి ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా విద్యార్థులు

నల్లజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లిలో నిర్వహిస్తున్న వేద భారత్ న్యాచురల్ ఫుడ్ ప్రొడక్ట్ సంస్థ సేద్యం చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని రంగారెడ్డి జిల్లా మల్లారెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు శక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీయ రకాలను సాగు చేయడం, ప్రకృతి వ్యవసాయం చేయడం, తదితర అంశాలను పరిశీలించారు. వ్యవసాయం అంటే ప్రస్తుత ఆధునాతన పద్ధతుల కంటే పూర్వపు దేశీయ పద్ధతుల ద్వారా ఎన్నో మేలైన లక్షణాలు ఉన్నాయని, రాబోయే తరం వారికి కూడా ఈ తరహా వ్యవసాయం సంపదలా మారుతుందని వ్యవసాయ విద్యార్థులు అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వేదభారత్ నాచురల్ ఫుడ్ ప్రొడక్ట్ సంస్థ ఎండీ ఎస్. వినయ్‌రామ్, ప్రతినిధులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యభగవాన్ ధన్వంతరి జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నేత సువర్ణరాజు

దేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తొలి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి అని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. శుక్రవారం కాకర్ల కల్యాణ మండపంలో నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో వైద్య భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సువర్ణరాజు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల కులదైవం, ప్రపంచ తొలివైద్యుడు ధన్వంతరి జయంతిని జరుపుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘానికి అన్ని వేళలా సహాయ సహకారాలు అందజేస్తానని సువర్ణరాజు తెలిపారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణులు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.కనకారావు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మల్లేశ్వరరావు, రాయవరపు గణపతి, కడియం సత్తిబాబు, కాశీ, నాగేశ్వరరావు, కూటమి నాయకులు సుంకర దుర్గారావు, దుగ్గిన లీలాగంగాధర్, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేపై గ్రామసభ

తాళ్లపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి సచివాలయం- 2 వద్ద శుక్రవారం భూమి రీ సర్వేపై రైతులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. దీనికి విచ్చేసిన తహశీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ కుకునూరు, వీరభద్రపురం రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయ్యిందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా రెవెన్యూ అధికారులకు తెలుపవచ్చున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారమ్మ ఆలయంలో కార్తీక దీపోత్సవం



బ్రాహ్మణగూడెంలో దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం, జ్యోతిర్లింగార్చన జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. చాగల్లు రాజరాజేశ్వరిస్వామి వారి ఆలయంలోనూ శిశేష పూజలు నిర్వహించారు. అనంతరం భజన కాలక్షేపం జరిగింది. అలాగే ఐఎంఎల్ డిపో వద్ద కార్తీక భోజనాలు జరిగాయి. ఉద్యోగులు, కార్మికులు, హమాలీ జట్టు కూలీలు సంయుక్తంగా ఏర్పాటు చేసారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్మికులు, ఉద్యోగులు కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

దేవరపల్లి: గౌరీపట్నం శ్రీగౌరీసమేత మహాలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు రామారావు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



గౌరీపట్నం శివాలయంలో కార్తీక వన సమారాధన

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తాడిమళ్ల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

నిడదవోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తాడిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు కె.మానస, ఎన్.చాందినీ శ్రీ, ఎస్‌కే సఫియా, జె.సుధ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరు రాజమండ్రిలో జరిగిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరచడంతో ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం సీహెచ్ పద్మ తెలిపారు. దీంతో ఈనెల 8,9,10 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడు బండి ప్రదీప్‌ను గ్రామస్థులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు ...

తాడిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బీ.ప్రేమ్‌కుమార్, ఎన్.గ్రీష్మ, ఏ.శివ, పి.కార్తీక్, పి.మురళీ వెంకట్ మరో ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం సీహెచ్ పద్మ తెలిపారు.

భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్త

గోపాలపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ సంఘటన దొండపూడిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కాసాని సింధూజ, తాళ్లపూడి మండలం కుమారదేవం గ్రామానికి చెందిన కాసాని రామకృష్ణకు 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, భార్యపై అనుమానంతో గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చి సింధూజపై కొడవలితో రామకృష్ణ దాడికి పాల్పడ్డాడు. అయితే తృటిలో సింధూజ తప్పించుకోవడంతో కుడిభుజానికి కొడవలి తగలడం వల్ల తీవ్రగాయాలపాలైంది దీనిపై సింధూజ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు అయ్యింది.

డివైడర్‌ను ఢీ కొట్టి ఒకరు మృతి ... ఇద్దరికి తీవ్రగాయాలు

నిడదవోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోజువారీ కోత మిషన్‌లో పనిచేసే ముగ్గురు యువకులు తెల్లవారుజామున టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చి బ్రిడ్జి డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడిన సంఘటన సమిశ్రగూడెం బ్రిడ్జిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చాగల్లు మండలం మల్లవరం, మార్కొండ పాడుకు చెందిన యువకులు మోటారు సైకిల్‌పై ట్రిపుల్ రైడింగ్‌లో విజ్జేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా సమిశ్రగూడెం ఓవర్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ సంఘటనలో చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన నామన కోట సత్యనారాయణ (సత్తిపండు) (28) సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మంగేష్కర్, చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన అరిగెల సాయి దుర్గ గాయాలపాలయ్యారు. దీనిపై గాయపడిన నాగిరెడ్డి మంగేష్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం ఏఎస్సై చిన్నయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మంగేష్కర్, సాయిదుర్గను మెరుగైన వైద్యసేవల నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు, గాయపడిన ఇద్దరు యువకులూ అవివాహితులే.

అన్ని కళాశాలల్లో నైపుణ్య శిక్షణ

●ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాలోని అన్ని కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన ప్రాంగణ నియామక శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తిచేసుకున్న 400 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నాంది ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్న తొలి విశ్వవిద్యాలయం నన్నయ అని అన్నారు. ఉన్నత విద్య పూర్తిచేసుకుని కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నపుడు ఈ శిక్షణ ముగింపు కాదని ఆరంభమని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్ఫటిక లింగేశ్వరుడ్ని దర్శించుకున్న భోగవల్లి



ప్రసాద్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

పెరవలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసియున్న అంబికా సమేత స్ఫటిక లింగేశ్వరస్వామి వారిని శుక్రవారం నిడదవోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా స్ఫటికలింగ దర్శనం తమకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. అన్నవరప్పాడు సొసైటీ అధ్యక్షుడు పప్పొప్పు నాగేశ్వరరావు, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.73 కోట్లు

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,73,37,811 నగదు, 37 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటుగా ఫ్రాన్స్ కరెన్సీ 200, యూఎస్ఏ 41 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పౌండ్స్, స్కాట్లాండ్ 20 డాలర్లు లభించాయి. లెక్కింపును ఈ వో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లెక్కించగా సరాసరిన రోజుకు రూ.5. 77 లక్షలు భక్తులు హుండీలలో సమర్పించారు. అలాగే అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఇద్దరు దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. జగ్గంపేటకు చెందిన కంచర్ల శ్రీనివాసరావు రూ.లక్ష, విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన గోలి గురునాధరావు రూ.1,01116 ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి ప్రసా దం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. అలాగే అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీలో ఒక గదికి డోనర్‌స్కీమ్ ద్వారా కాకినాడకు చెందిన ములకల సుబ్బారావు, కనకదుర్గ దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని శుక్రవారం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.